## మహనీయుల ఆశయ సాధనకు కృషి చేయాలి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఎదులాపురం, ఏప్రిల్ 2 : మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ వారి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతిని పురస్కరించుకుని గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బస్‌స్టాండ్ ఎదుట గల పాపన్న విగ్రహం వద్ద పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బహుజనులకు రాజ్యాధికారం దక్కాలని కాంక్షించిన మహోన్నత వ్యక్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని గుర్తు చేశారు. గ్రామ గ్రామాన పాపన్న గౌడ్ విగ్రహాలను ఏర్పాటు చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు సుధాకర్ గౌడ్, భూమాగౌడ్, రమేశ్ చందర్‌గౌడ్, లక్ష్మీనారాయణగౌడ్, దినేశ్‌గౌడ్, చరణ్‌గౌడ్, మహేందర్ గౌడ్, నరేశ్ గౌడ్ పాల్గొన్నారు.

## అటకెక్కిన ఆరు గ్యారెంటీలు

- ప్రజలను నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్
- బీజేపీ మండల నాయకుల సమావేశంలో ఎమ్మెల్యే రామారావు పటేల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

కుభీర్, ఏప్రిల్ 2 : శాసనసభ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల వాగ్ధానాల్లో ఏ ఒక్కటి అమలుకు నోచుకోక అటకెక్కాయని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. మంగళవారం మండల కేంద్రం కుభీర్‌లో పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తల సన్నాహక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రూ.500లకే వంటగ్యాస్ సిలిండర్ ఎక్కడ అమలు కాకపోగా, రూ.2 లక్షల రైతుల బ్యాంకు రుణాల జాడే లేదన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను అనుకూలంగా మలుచుకుని కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి ఆదిలాబాద్ పార్లమెంటు స్థానాన్ని భారీ మెజారిటీతో కైవసం చేసుకోవాలని కోరారు.

## ఎర్రటెండలో 'ఉపాధి' భోజనం

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలు ఎర్రటెండలో భోజనం చేస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం లోకల్ వెల్మల్ గ్రామ సమీపంలోని ఎస్సారెస్పీలో తట్టలు, టవల్స్ నెత్తిపై పెట్టుకుని సమూహంగా తింటున్నారు. సాధారణంగా ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటుతుండడంతో సర్కారు కూలీలకు టెంట్లు, మంచినీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లతోపాటు, మెడిసిన్ కిట్స్‌ను అందుబాటులో ఉండాలి. వసతులు కల్పించకపోవడంతో కూలీలు నడెండలోనే భోజనం చేస్తున్నారు. వడదెబ్బ బారిన పడే ప్రమాదం ఉందని, వసతులు కల్పించాలని కూలీలు కోరుతున్నారు.

*- సోన్, ఏప్రిల్ 2*



లోకల్ వెల్మల్ సమీపంలోని ఎస్సారెస్పీలో తట్టలను నెత్తిమీద పెట్టుకుని భోజనం చేస్తున్న ఉపాధి కూలీలు

## సార్లకు శిక్షణ.. బడులకు తాళం

సోన్ మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయి. విషయం ఆరాతీస్తే ఉపాధ్యాయులకు ఎన్నికల శిక్షణ కొనసాగుతోంది. శిక్షణ పేరిట బడులకు తాళం వేయడం ఎంతవరకు సమంజసమని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న శిక్షణకు పాక్‌పట్ల, లోకల్ వెల్మల్, గాంధీనగర్, లెఫ్ట్ పోచంపాడ్ తదితర గ్రామాల్లోని ఉపాధ్యాయులందరూ ఒకేసారి శిక్షణకు వెళ్లడంతో ఆయా ప్రభుత్వ బడులకు అనధికారికంగా సెలవు ప్రకటించారు. దీంతో మంగళవారం ఆ పాఠశాలలన్నీ పని చేయలేదు. విద్యార్థులందరూ బయట తిరుగుతూ కన్పించారు. ఎంఈవో శంకర్‌ను వివరణ కోరగా.. సదరు పాఠశాలల ఉపాధ్యాయులందరికీ ఒకేరోజు ఎన్నికల శిక్షణ ఉండడంతో విధులకు హాజరుకాలేకపోయారని పేర్కొన్నారు. ఉపాధ్యాయులకు శిక్షణ ఉంటే మండలంలోని ఇతర ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాల్సిందిపోయి పాఠశాలలను బంద్ చేయడం ఏంటని స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

*- సోన్, ఏప్రిల్ 2*




పాక్‌పట్ల ఉన్నత పాఠశాలకు తాళం వేసి ఉన్న దృశ్యం



లోకల్ వెల్మల్ పాఠశాల గేటుకు తాళం

## పరస్పర సహకారంతో పనిచేద్దాం..

### డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, మండ్వీ డీఎస్పీ సింగరే

ఎదులాపురం, ఏప్రిల్ 2 : మహారాష్ట్ర-తెలంగాణ పోలీసులం అందరం కలిసి పరస్పర సహకారంతో పనిచేద్దామని ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆయన కార్యాలయంలో మహారాష్ట్ర సరిహద్దు మండ్వీ డీఎస్పీ సింగరే, సీఐ గఫార్‌షేక్‌లతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో నిఘా కొనసాగుతుందన్నారు. అక్రమంగా మద్యం తరలించడం, నాన్‌బెయిలెబుల్ వారెంట్, దొంగల సమాచారం, దేశీదారు సరఫరా కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. మండ్వీ డీఎస్పీ సింగరే మాట్లాడుతూ.. మా పరిధిలో మండ్వీ, సిండికేడ్, మహోర్ స్టేషన్ పరిధిలో ఉన్నాయన్నారు. సమాచారాన్ని పూర్తిగా అందిస్తామన్నారు. వన్, టూటౌన్ సీఐలు సత్యనారాయణ, అశోక్ పాల్గొన్నారు.

## వేతనం కట్.. డిప్యూటేషన్ రద్దు..

- ప్రధానోపాధ్యాయుడికి మెమో జారీ
- 'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన

నమస్తే ఎఫెక్ట్

పెంబి, ఏప్రిల్ 2 : ఇటిక్యాల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. సోమవారం ఉపాధ్యాయుడు సురేశ్ అనుమతి లేకుండా పాఠశాలకు డుమ్మా కొట్టడం, ఉపాధ్యాయుడు అనిల్ డిప్యూటేషన్‌పై మందపల్లి గ్రామంలో విధులు నిర్వహిస్తుండడంతో 'నమస్తే' పత్రికలో 'ఉపాధ్యాయులు డుమ్మా' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. వెంటనే స్పందించిన జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్‌రెడ్డి అనిల్ ఉపాధ్యాయుడి డిప్యూటేషన్‌ను రద్దు చేశాడు. నిర్లక్ష్యం వహించిన కాంప్లెక్స్ హెచ్‌ఎం గంగాధర్‌కు మెమో జారీ చేశాడు. అనుమతి లేకుండా పాఠశాలకు గైర్హాజరైన సురేశ్‌కు ఒక్క రోజు వేతనం నిలిపివేసినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు విధులపై నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని ఎంఈవో మధుసుదన్ హెచ్చరించారు.


ఉపాధ్యాయులు డుమ్మా

'నమస్తే తెలంగాణ'లో ప్రచురించిన కథనం

## జాతీయ స్థాయిలో రాణించడం అభినందనీయం

### అదనపు శిక్షణ కలెక్టర్ కిరణమాయి

ఉట్నూర్, ఏప్రిల్ 2 : గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాల విద్యార్థులు రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడల్లో రాణించడం అభినందనీయమని అదనపు శిక్షణ కలెక్టర్ కిరణమాయి అన్నారు. మంగళవారం ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్‌లోని గిరిజన క్రీడా పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్రీడాకారులు అవకాశాలు సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. తల్లిదండ్రులు, గురువుల కష్టాన్ని గుర్తు చేసుకుంటు చదువులతోపాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. అంతకుముందు క్రీడా పాఠశాల జీమ్, క్రీడాగది, మైదానాలను పరిశీలించారు. క్రీడా పాఠశాల పని విధానం ఇతర ఐటీడీఏ డీడీ దిలీప్‌ను అడిగి తెలుసుకున్నారు. జాతీయ స్థాయిలో పథకాలు సాధించిన క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏవో రాంబాబు, క్రీడా అధికారి కే.పార్థసారథి, ఏటీడీవో క్రాంతికుమార్, ప్రధానోపాధ్యాయుడు ఉత్తమ్, ఏఎస్‌వో జె.హేమంత్‌కుమార్, సునంద్, శేఖర్ పాల్గొన్నారు.



ఉట్నూర్ క్రీడాకారులతో అదనపు శిక్షణ కలెక్టర్ కిరణమాయి



ఆదిలాబాద్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు



నిర్మల్ కలెక్టర్ కార్యాలయంలో ఏవోకు వినతిపత్రం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## నష్టపరిహారం చెల్లించాలి..

- పంటలకు బోనస్ ఇవ్వాలి..
- బీఆర్ఎస్ నాయకుల డిమాండ్
- కలెక్టర్, ఏవోకు వినతిపత్రం అందజేత

ఆదిలాబాద్, ఏప్రిల్ 2(నమస్తే తెలంగాణ) : ఇటీవల కురిసిన వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలంటూ, రైతులు పండించిన పంటకు బోనస్ చెల్లించాలని, ఇటీవల కురిసిన వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టర్ రాజర్షి షాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలతో 4 వేల ఎకరాల్లో రైతులు జొన్న, కంది, నువ్వు, పొగాకు పంటలను నష్టపోయారని తెలిపారు. రైతులు అహర్నిశలు కష్టపడి సాగు చేసిన పంటలు నష్టపోయినా రాష్ట్ర ప్రభుత్వంలో స్పందన లేదన్నారు. వరితోపాటు రైతులు ఇటీవల విక్రయించిన సోయా, శనగ పంటలకు ప్రభుత్వం బోనస్ చెల్లించాలని కోరారు. జిల్లాలో ప్రభుత్వం శనగ కొనుగోళ్లను జరపకపోవడంతో రైతులు దళారులకు పంటను విక్రయించి నష్టపోవాల్సి వస్తుందన్నారు. మద్దతు ధరతో పంటను కొనుగోలు చేయాలని కోరారు. సాగునీరు లేక పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేల పంపిణీ చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2 లక్షల రుణమాఫీ ఏమైందని ప్రశ్నించారు. రైతుబంధు పంపిణీలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రోకండ్ల రమేశ్, మెట్టు ప్రహ్లాద్, లింగారెడ్డి, విజ్జిగిరి నారాయణ, దాసరి రమేశ్, మర్సెట్టి గోవర్ధన్, యాస నర్సింగ్‌రావు, కుమ్ర రాజు, మెట్టి పోచన్న, సతీశ్, విఠల్ పాల్గొన్నారు.

### నిర్మల్ జిల్లాలో..

నిర్మల్ టౌన్, ఏప్రిల్ 2: కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సమస్యలను పరిష్కరించి ధాన్యం రైతులకు రూ.500 బోనస్ ఇవ్వాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఆ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిర్మల్ పట్టణంలో మంగళవారం ర్యాలీ నిర్వహించి కలెక్టర్ కార్యాలయంలో ఏవోకు వినతిపత్రం అందించారు. రేవంత్‌రెడ్డి సర్కార్ రైతులకు ప్రకటించిన రూ.2 లక్షల రుణమాఫీని వెంటనే అమలు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు రాంకిషన్‌రెడ్డి, లోలం శ్యాంసుందర్, గాదె విలాస్ మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా రైతులకు ప్రకటించిన రూ.2 లక్షల రుణమాఫీని తొలి సంతకంతోనే అమలు చేస్తామని చెప్పిన సర్కార్ మూడు నెలలు పూర్తయినా ఎందుకు అమలు చేయడం లేదో తెలుపాలని డిమాండ్ చేశారు. ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వాలని, వర్షాల వల్ల దెబ్బ తిన్న రైతులకు రూ.10 వేల ఆర్థికసాయం అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ కిరణ్, మారుగొండ రాము, ఖానాపూర్ రాము, సుభాష్ రావు, నజీర్ పాల్గొన్నారు.

## రెండే నిమిషాలు..

సదరం స్లాట్ బుకింగ్ ప్రారంభమైన వెంటనే వైబ్‌సైట్ క్లోజ్

- ప్రతినెలా 30 మందికి మాత్రమే అవకాశం
- పింఛన్ రాక అవస్థలు పడుతున్న దివ్యాంగులు

నిర్మల్ టౌన్, ఏప్రిల్ 2 : నిర్మల్ జిల్లావ్యాప్తంగా 13 వేల మంది దివ్యాంగ పింఛన్‌దారులు ఉండగా.. ఇంకా అర్హులైన వారు దాదాపు 3 వేలకుపైగా ఉంటారు. ప్రభుత్వం వికలాంగులకు నెలకు రూ.3,016 సాయం అందిస్తుండగా.. అన్ని అర్హతలు ఉండి పింఛన్ కోసం చాలా మంది ఎదురు చూస్తున్నారు. వీరందరికీ సర్కారు సదరం క్యాంపులు నిర్వహించి అర్హులను ఎంపిక చేయాలి. ప్రధానంగా చెవిటి, మూగ, కుంటి, మానసిక స్థితి బాగా లేనివారికి ఏరియా దవాఖానల్లో శిబిరాలు నిర్వహిస్తారు. కాగా.. జిల్లాలోని 18 మండలాలతోపాటు నిర్మల్, ఖానాపూర్, భైంసా మున్సిపాలిటీల్లోని దివ్యాంగులకు నెలకు కేవలం 30 మందికి మత్రమే స్లాట్ బుకింగ్స్‌కు అనుమతి ఇస్తున్నారు. ఒక్కొక్క మండలంలో కనీసం 100–150 మంది వరకు దివ్యాంగులు ఉండగా.. వారికి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం సరిపోక పెన్షన్‌కు అర్హత సాధించలేక పోతున్నామని ఆవేదన చెందుతున్నారు. జిల్లాలో స్లాట్ బుకింగ్‌లకు మొత్తం78 మీసేవా కేంద్రాలు ఉండగా.. ప్రభుత్వం స్లాట్ అనుమతి ఇచ్చిన రోజు 50 నుంచి 100 మందికిపైగా దివ్యాంగులు వస్తున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు.

### రెండు నిమిషాల్లోనే క్లోజ్

దివ్యాంగులు పింఛన్ పొందేందుకు, కాలపరిమితి ముగిసిన వారు కూడా తప్పకుండా సదరం శిబిరానికి హాజరుకావాలి. శిబిరాల నిర్వాహకులు స్లాట్ బుకింగ్‌కు అనుమతి ఇచ్చినపుడే మీసేవా ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. నిర్దేశిత తేదీల్లోనే ప్రభుత్వం స్లాట్ బుకింగ్ వెబ్‌సైట్‌ను ఓపెన్ చేస్తుంది. ఓపెన్ కావడంతోనే కేంద్రాల వద్ద బాధితులు గంటల తరబడి వేచి చూస్తున్నారు. ఎండనక, వాననక, చలనక కేంద్రాల వద్ద వేచి చూడాల్సి వస్తున్నది. ప్రతి గ్రామంలో కేంద్రాలు లేకపోవడంతో ఉన్న చోట్ల ఉదయం నుంచే క్యూలు కడుతున్నారు. స్లాట్ ఉదయం 11 గంటలకు ఓపెన్ కాగానే మీసేవా కేంద్రం నిర్వాహకులపై ఒత్తిడి పెరుగుతున్నది. చాలా మంది రావడంతో ఏమి చేయాలో తోచడం లేదని పేర్కొంటున్నారు. వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసేలోపే స్లాట్ పూర్తయినట్లు సిగ్నల్ రావడంతో బాధితులు వెనుదిరుగుతున్నారు. ఇలా కొందరికి ఎండ్లకేండ్లుగా స్లాబ్ బుకింగ్ దొరుకడం లేదని పేర్కొంటున్నారు. కండ్లు లేనివారు, నడవలేనివారు కేంద్రాలకు రావడానికి అవస్థలు పడుతున్నారు. శారీరకంగా ఇబ్బందితోపాటు ఆర్థికంగా కూడా అవస్థలు పడుతున్నారు. రవాణా చార్జీలు కూడా భరించలేక పోతున్నామని వాపోతున్నారు. స్లాట్ బుకింగ్ 30 మందికే ఇవ్వడంతో దివ్యాంగులపై సర్కారుకు ఉన్న ప్రేమ అర్థమవుతున్నదని పేర్కొంటున్నారు. స్లాట్స్ సంఖ్యను పెంచాలని కోరుతున్నారు.

● దివ్యాంగుల కష్టాలు



మీసేవా కేంద్రంలో స్లాట్ బుక్ చేస్తున్న సిబ్బంది

### పెన్షన్ ఆగింది..



నా పేరు భూమవ్వ. మాది లోకేశ్వరం మండలంలోని ఎడ్దూర్ గ్రామం. నేను దివ్యాగురాలును. పదేండ్ల నుంచి పెన్షన్ తీసుకుంటున్నా. ప్రతినెలా రూ.3,016 వచ్చేవి. నాకు సదరం క్యాంపులో ఇచ్చిన దివ్యాంగుల పత్రం కాలపరిమితి నాలుగు నెలల క్రితమే ముగిసింది. దీంతో పెన్షన్‌ను ప్రభుత్వం నిలిపి వేసింది. అప్పటి నుంచి రెన్యూవల్ చేసుకోవడానికి మీసేవా కేంద్రాల చుట్టూ తిరుగుతున్నా. రవాణా ఖర్చులు మీద పడుతున్నవే తప్పా స్లాట్ బుక్ కావడం లేదు. నా వయసు 75 ఏండ్లు. ఈ వయసులో తిరగడం కష్టంగా ఉంది.

### స్లాట్స్‌ను పెంచాలి..



దివ్యాంగులకు స్లాట్స్ సంఖ్యను పెంచాలని అధికారులకు విన్నవించినం. ప్రతినెలా అన్ని రకాల దివ్యాంగులకు 50 మించి స్లాట్స్ ఇవ్వకపోవ డంతో దివ్యాంగులు ఇబ్బంది పడుతున్నరు. అర్హులైన వారికి పెన్షన్‌లు రాక మీసేవా కేంద్రాల చుట్టూ తిరుగడం వల్ల ఖర్చులు పెరిగి ఇటు పెన్షన్ రాక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్లాట్స్ సంఖ్యను ప్రతి మీసేవకు కనీసం 50 ఇవ్వాలి. ప్రభుత్వ అధికారులు స్పందించి న్యాయం చేయాలి.

*- ఇసాక్, దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు, నిర్మల్.*

### వైద్యులకు నివేదించాం..



ప్రతినెలా సదరం శిబిరా ల కోసం స్లాట్స్ బుకింగ్స్ చేస్తున్నాం. ఆన్‌లైన్ కావడంతో కొందరికి మాత్రమే స్లాట్ దొరుకుతున్నది. స్లాట్స్ పెంచాలని ప్రభుత్వానికి, వైద్యులకు నివేదిక ఇచ్చినం. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలి. స్లాట్ బుకింగ్ చేసుకున్న వెంటనే వైద్యులతో పరీక్షలు నిర్వహించి అర్హులైన వారికి కొత్త పెన్షన్, పాత వారికి రెన్యూవల్ చేస్తున్నాం.

*- విజయలక్ష్మి, జిల్లా అధికారి.*

## 'పది' మూల్యాంకనానికి రెడీ

- నేటి నుంచి సెయింట్ థామస్ పాఠశాలలో ప్రారంభం
- నిర్మల్ జిల్లాకు చేరిన 1.40 లక్షల జవాబు పత్రాలు

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 2 : పదో తరగతి మూల్యాంకనాన్ని బుధవారం నుంచి విద్యాశాఖ ప్రారంభించనుంది. నిర్మల్ జిల్లా కేంద్రంలోని స్థానిక సెయింట్ థామస్ పాఠశాలలో ఏర్పాట్లు చేశారు. తొమ్మిది రోజులపాటు మూల్యాంకనం చేసి 12వ తేదీన క్యాంపును ముగించనున్నారు. నిర్మల్ జిల్లాకు తెలుగు, ఇంగ్లిష్ మీడియం సబ్జెక్టులకు సంబంధించి వివిధ జిల్లాల నుంచి 1.40 లక్షల పేపర్లు వచ్చాయి. వీటిని స్ట్రాంగ్ రూంలో భద్రపరిచి, బందోబస్తు ఏర్పాటు చేశారు.

### పటిష్టంగా మూల్యాంకనం..

లోటుపాట్లు లేకుండా ప్రశాంతంగా మూల్యాంకనం చే సేందుకు విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఎగ్జామినర్లు(ఏఈ) సెల్‌ఫోన్ వాడకుండా చర్యలు తీసు కుంటున్నారు. ఉపాధ్యాయులు దిద్దిన పేపర్లను ఆయా సబ్జెక్టుకు సంబంధించిన ఎక్స్‌పర్ట్‌లు తనిఖీ చేస్తారు. స్క్రూటినైజింగ్ చేసిన అనంతరం కోడింగ్, డీకోడింగ్ ఆధారంగా మార్కులు వేస్తారు.

### అధికారులు వీరే..

మూల్యాంకనానికి విద్యాశాఖకు చెందిన పలువురు అధికారులు విధుల్లో పాల్గొననున్నారు. జిల్లా క్యాంపు ఆఫీసర్‌గా డీఈవో రవీందర్‌రెడ్డి, అసిస్టెంట్ క్యాంపు అధి కారులు ఇద్దరు, స్ట్రాంగ్ రూం ఇన్‌చార్జి ఒకరు, పర్యవేక్ష కుడు ఒకరు, అసిస్టెంట్ కోడింగ్ అధికారులు ఏడుగురు, కోడింగ్ సహాయకులు 30, ఏఈలు 394, సీఈలు 65, స్పెషల్ అసిస్టెంట్‌లు 67, మూల్యాంకన పర్యవేక్షకులు ఏడుగురి ఆధ్వర్యంలో మూల్యాంకనం పూర్తవుతుంది.



మూల్యాంకన కేంద్రం

### సకాలంలో పూర్తి చేస్తాం..



నిర్మల్ జిల్లాకు విద్యాశాఖ నిర్దేశించిన గడువులోగా మూల్యాంకనాన్ని పూర్తి చేస్తామని క్యాంపు అధికారి, డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే జిల్లాకు 1.40 లక్షల జవాబు పత్రాలు జిల్లాకు చేరాయి. వీటిని పోలీసు పహారాలో స్ట్రాంగ్ రూంలో భద్రపర్చాం. మూల్యాంకన కేంద్రంలో ఏఈ, సీఈ మిగతా అధికారులందరూ క్యాంపు మార్గదర్శకాలను పాటించి మూల్యాంకనం చేయాలని సూచించాం. అందరి సహకారంతో పొరపాట్లు జరుగకుండా పూర్తి చేస్తాం.

*- రవీందర్‌రెడ్డి, క్యాంపు అధికారి.*